సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 3 । జనవరి । 2023



శ్రీవారి నిత్యాన్నదానానికి విరాళం


ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన నందేటి కృష్ణ ప్రసాద్ సోమవారం రూ. 3,65,000 లను విరాళంగా అందజేశారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి బోణం విజయ సారథి దంపతులు (అంతర్వేదికర) రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 10,050 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 10,050 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 5,050 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పోలీసు స్పందనకు 23 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ లతామాధురి

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 23 అర్జీలు వచ్చాయి. ఏఎస్పీ కె.లతా మాధురి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. వచ్చిన అర్జీల్లో భూ తగదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. ఎస్పీ కార్యాలయం స్పందన కార్యక్రమ పర్యవేక్షణ ఎస్సై సీహెచ్ వెంకటరమణ కూడా పాల్గొన్నారు.

జీవన ప్రమాణ పత్రాల సమర్పణ



జెట్ ప్రింటర్‌ను బహూకరిస్తున్న అబ్బీసు మాస్టారు

అమలాపురం టౌన్: స్థానిక ఏవీఆర్ నగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జిల్లా సంఘ భవనంలో పెన్షనర్ల వార్షిక తనిఖీ, ధ్రువపత్రాల అప్‌లోడ్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్‌వీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది పెన్షనర్లు తమ జీవన ప్రమాణ ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. జిల్లాలోని పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కార్యాలయానికి పెన్షనర్ జీవీఎల్ఎస్ శర్మ (అబ్బీసు మాస్టారు) రూ.12 వేల జెట్ ప్రింటర్ మెషీన్ బహూకరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయి వరప్రసాద్, కోశాధికారి జేఎస్ శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ముఖేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి కుసుమ ముఖేష్ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్, డీసీఓ ఎ.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఇటీవల కాకినాడలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన జరిగిన హైజంప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ముఖేష్ బంగారు పతకం కైవశం చేసుకున్నాడు. దీంతో ఈ నెల 12, 13, 14 తేదీల్లో బిహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముఖేష్‌ను ప్రిన్సిపాల్, డీసీఓతో పాటు పీడీ వంగా సతీష్‌రాజు, పీఈటీ యర్రంశెట్టి సుబ్రహ్మణ్యం, పీఎంసీ చైర్మన్ జల్లి శ్రీను, వైస్ చైర్‌పర్సన్ ఉప్పాడ జ్యోతి, సర్పంచ్ బీర వెంకమాంబ, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి తదితరులు అభినందించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

మలికిపురం: కేశనపల్లి బీచ్ వద్ద సముద్రంలో ఆదివారం గల్లంతయిన డిగ్రీ విద్యార్థి శివకోటి సాయి మణికంఠ (19) మృతదేహం సోమవారం లభ్యమైంది. ఎస్సై హరికోటిశాస్త్రి కథనం ప్రకారం.. రాజోలు మండలం పొదలాడకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆదివారం సముద్రంలో స్నానాలకు దిగారు. ప్రమాదవశాత్తూ ముగ్గురు లోపలకు వెళ్లిపోయారు. తీరంలో ఉన్న వ్యక్తి అది గమనించి, ఇద్దరిని రక్షించాడు. సాయి మణికంఠ మృతి చెందాడు.

బీఎస్పీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అమలాపురం టౌన్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా శాఖ సమావేశం ప్రధాన కార్యదర్శి కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జులుగా కాండ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీభవాని, అధ్యక్షుడిగా చింతా సత్య, ఉపాధ్యక్షుడిగా జిత్తుగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కుసుమ వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా అప్పారి విజయరాజు నియమితులయ్యారు. సమావేశంలో పార్టీ అమలాపురం నియోజకవర్గ అధ్యక్షుడు కోలా త్రిమూర్తులు తదితరులు ప్రసంగించారు.

అభాగ్యులకు వెలుగు రేఖలా



- నేడు రాజమహేంద్రవరానికి సీఎం జగన్ రాక
- పెన్షన్ పెంపు వారోత్సవాలకు శ్రీకారం
- ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలకు గోదారి సీమ పైనే నాంది
- తాజాగా రికార్డు స్థాయిలో నూతన పెన్షన్ల మంజూరు
- మూడు జిల్లాల్లో 33 వేల మందికి పైగా కొత్త లబ్ధిదారులు
- **జననేత రాకపై జనంలో పరవళ్లు తొక్కుతున్న ఉత్సాహం**



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, కలెక్టర్ మాధవీలత తదితరులు

సాక్షి ప్రతినిధి, రాజమహేంద్రవరం: అటు గోదావరిలో జల పరవళ్లు.. ఇటు జన పరవళ్లు.. చాలా రోజుల తరువాత ఈ అపూరూప దృశ్యం చారిత్రక రాజమహేంద్రవరం నగరంలో ఆవిష్కృతం కానుంది. వైఎస్సార్ పెన్షన్ పెంపు వారోత్సవాలకు శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం రాజమహేంద్రవరం వస్తున్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలతో.. ఇంటి పెద్దలా తమ బాగోగులను అడుగడుగునా చూస్తూ.. కష్టాల్లో ఆదుకుంటూ.. చేయిపట్టి ముందుకు నడిపిస్తున్న తమ ప్రియనేతను కళ్లారా చూసేందుకు.. వేలాదిగా ప్రజలు.. పరవళ్లు తొక్కుతున్న ఉత్సాహంతో రాజమహేంద్రి దిశగా కదులుతున్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగే సీఎం బహిరంగ సభకు అధికార యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది.

తండ్రి తరహాలోనే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక అభిమానం చూపేవారు. ఆయన అనేక సంక్షేమ పథకాలకు ఇక్కడే శ్రీకారం చుట్టారు. ఆయన వారసుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఈ ప్రాంతంపై అదే స్థాయిలో ప్రేమ కనబరుస్తున్నారు. వివిధ ప్రాధాన్య కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లానే వేదికగా చేసుకుంటున్నారు. గడచిన మూడున్నరేళ్లుగా వివిధ సంక్షేమ పథకాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడే శ్రీకారం చుట్టారు. తాజాగా మరో బృహత్తర కార్యక్రమం పెన్షన్ పెంపు వారోత్సవాల ప్రారంభానికి తూర్పు గోదావరి మరోసారి వేదికగా నిలుస్తూండటం విశేషం.

అభాగ్యులకు ఆసరాగా.. వైఎస్సార్ పెన్షన్ కానుక

వైఎస్సార్ పెన్షన్ కానుక అభాగ్యులకు ఆసరాగా నిలుస్తోంది. లక్షలాది పేదల కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతోంది. ఈ పథకం కింద గత నెల వరకూ ఇస్తున్న రూ.2,500 పింఛనును ఈ నెల నుంచి మరో రూ.250 పెంచి, రూ.2,750 చేశారు. పెన్షన్ పెంపుతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెద్ద సంఖ్యలో అభాగ్యులకు మేలు చేకూరుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ పెన్షన్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే రెండు పర్యాయాలు పెంచారు. తాజా పెంపుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెన్షన్‌ను రూ.750 మేర పెంచినట్లయింది. అంతే కాదు.. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఒకేసారి కొత్తగా 33,816 మందికి కొత్త సంవత్సరం నుంచి పెన్షన్లు అందిస్తున్నారు.

ఎన్నో పథకాలకు ఇక్కడే శ్రీకారం

- నాటి చంద్రబాబు ప్రభుత్వ హయంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాడు విపక్ష నేతగా ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా చూశారు. కాకినాడ సిటీ, రూరల్‌లో మత్స్యకారులతో మమేకమై వారి కష్టాలను సావధానంగా ఆలకించారు. అప్పుడే ఆయన మదిలో మత్స్యకార భరోసా పథకం మెదిలింది. సీఎం అయ్యాక ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా 2019 నవంబర్ 22న ముమ్మిడివరం మండలం కొమానపల్లిలో ఈ పథకాన్ని ప్రారంభించారు. తొలి విడత సాయం అందజేశారు. మత్స్యకార భరోసా మరో విడత పంపిణీకి కూడా ప్రస్తుత కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వేదికగా నిలవడం విశేషం.
- గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం దేశ చరిత్రలోనే గ్రామ సచివాలయ వ్యవస్థ మొగ్గ తొడిగింది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే. గాంధీ జయంతి సందర్భంగా 2019 అక్టోబరు 2న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండల కేంద్రంలో సీఎం ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. సరికొత్త గ్రామ పాలనకు తెరతీశారు.
- **విద్యారంగంలో వినూత్న విధానాలకూ వేదికగా నిలిచింది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాయే. ప్రతిష్టాత్మకమై మన బడి నాడు–నేడు పథకం తొలి దశ విజయవంతమైన సందర్భంగా సీఎం కోనసీమ జిల్లాకు వచ్చారు.** కార్పొరేట్‌కు దీటుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన 15,715 పాఠశాలలను పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రజలకు అంకితం చేశారు.
- సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల కట్టడికి ప్రతిపాదిత దిశ చట్టం కింద ప్రత్యేక యాప్ రూపుదిద్దుకున్నదీ తూర్పు గోదావరి జిల్లాలోనే. రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 2020 ఫిబ్రవరి 8న దీనిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అప్పటి దిశ రాష్ట్ర ప్రత్యేకాధికారి కృతికా శుక్లా ప్రస్తుతం కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీల నిర్మాణానికి 2020 డిసెంబర్ 25న నేటి కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం కొమరగిరిలో సీఎం భూమిపూజ చేశారు.
- కాపు సామాజిక వర్గంలో వెనుకబడిన వారికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిన వైఎస్సార్ కాపునేస్తం పథకం కింద మూడో విడత సాయాన్ని గత ఏడాది జూలై 29న గొల్లప్రోలులో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు నిధులు జమ చేశారు.
- ఇలా పలు ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి తూర్పు గోదావరి నుంచే ప్రారంభించి ఈ ప్రాంతవాసులపై ప్రత్యేక అభిమానాన్ని చాటుకుంటున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు పూర్తయిన ఏర్పాట్లు

పెన్షనే ఆధారం



నా భార్య వీరరాఘవమ్మకు అభయహస్తం పెన్షన్ రూ.500 వస్తుంది. నాకు వృద్ధాప్య పింఛన్ రూ.2,750 వస్తోంది. వృద్ధాప్యంతో పనికి వెళ్లలేక, నెలవారీ ఖర్చులకు ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ పైనే ఆధారపడి మేము జీవిస్తున్నాం. మాకు కుమారుడు, కుమార్తె. ఎవరి జీవితాలు వారు సాగిస్తున్నారు. పెన్షన్‌తో పాటు ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం కూడా మాకు ఆధారంగా నిలుస్తున్నాయి. నాకు ఇస్తున్న పెన్షన్‌ను ప్రభుత్వం పెంచడంతో మరికొంత ఆసరా లభించినట్టే.

- మాధవరపు బులి వీర్రాజు, రాయవరం

ఇంటికే పింఛను, రేషను..



ఒంటరిగా జీవిస్తున్నా. నాడు రాజశేఖరరెడ్డి పుణ్యమాని నాకు వృద్ధాప్య పింఛను మంజూరైంది. నేడు సీఎం జగన్ పుణ్యమాని ప్రతి నెలా ఒకటో తారీకు తెల్లవారకుండానే వలంటీర్ అమ్మాయి ఇంటి వద్దకే పింఛను తెచ్చి ఇస్తోంది. ఏటా పింఛను డబ్బులు పెంచుతూ ఈ నెల రూ.2,750 ఇచ్చారు. ఇంటి వద్దకే రేషన్ తెచ్చి ఇస్తున్నారు. ఇంతకంటే ఇంకేం కావాలి! మాలాంటి వారిని ఆదుకుంటున్న జగన్‌బాబు పది కాలాల పాటు సీఎంగా ఉండాలని దేవుడిని కోరుకుంటున్నాను.

- గొలకోటి నాగరత్నం, కొత్తపేట

సీఎం జగన్ సభకు సర్వం సిద్ధం

- ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో బహిరంగ సభ
- మున్సిపల్ స్టేడియం నుంచి సభా వేదిక వరకూ స్వాగత తోరణాలు



సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరంలో మంగళవారం జరిపే పర్యటనకు సర్వం సిద్ధమైంది. మున్సిపల్ స్టేడియంలోని హెలిప్యాడ్ నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలోని సభా వేదిక వద్దకు రోడ్‌షో ద్వారా సీఎం రానున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. సీఎం పర్యటించే మార్గాన్ని పార్టీ తోరణాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సుందరంగా అలంకరించాయి. ప్రతిష్టాత్మకమైన పింఛను పెంపు కార్యక్రమానికి సీఎం వస్తూండటంతో ఘన స్వాగతం పలికేందుకు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 62.5 లక్షల పింఛన్లు

ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లకు పెద్దపీట వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 39 లక్షల మందికి వివిధ రకాల పింఛన్లకు గాను రూ.400 కోట్లు ఇస్తుండగా.. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏకంగా 62.5 లక్షల మందికి ప్రతి నెలా రూ.1,780 కోట్లు అందజేస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛను మొత్తం పెంచుతున్నారు. ఈ నెల నుంచి మరో రూ.250 అదనంగా అందజేస్తున్నారు. ప్రతిష్టాత్మక పింఛను పెంపు పథకానికి సీఎం రాజమహేంద్రవరం నుంచి శ్రీకారం చుడుతూండటంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి వేణు

ఆర్ట్స్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రి వేణు, ఎంపీ మార్గాని భరత్‌రామ్ సోమవారం పరిశీలించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అవ్వాతాతలకు పింఛన్లు అందిస్తున్నట్లు ఎంపీ చెప్పారు. సామాజిక చైతన్య మహోద్యమం నిర్వహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు భారీగా తరలివచ్చి స్వాగతం పలకాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సీఎం పర్యటన షెడ్యూలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరంలోని హెలిప్యాడ్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు.
- 11.20కి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని సభా వేదికకు వస్తారు.
- మధ్యాహ్నం 1.10 వరకూ వైఎస్సార్ పింఛను కానుక పెంపు, స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులతో ముఖాముఖిలో పాల్గొని, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
- అనంతరం రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.
- మధ్యాహ్నం 1.40 గంటలకు తాడేపల్లికి బయలుదేరుతారు.

బాలబాలాజీ స్వామికి బంగారు పాదాలు



బంగారు పాదాలకు సంప్రోక్షణ చేస్తున్న దాతలు



స్వామికి సమర్పించిన బంగారు పాదాలు

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువు తీరిన శ్రీ బాలబాలాజీ స్వామి వారికి మామిడికుదురుకు చెందిన నయినాల తమ్మారావు, హైమావతి, వారి కుమారుడు నయినాల శ్రీనివాస్, నాగభాస్కరజ్యోతి దంపతులు సోమవారం బంగారు పాదాలు సమర్పించారు. సుమారు 312 గ్రాముల బంగారంతో చేయించిన ఈ పాదాల విలువ రూ.18 లక్షలుంటుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్ తెలిపారు. బంగారు పాదాలకు అర్చకుడు గుదిమెళ్ల వెంకట లక్ష్మణాచార్యులు ఆధ్వర్యాన సంప్రోక్షణ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని స్వామి వారికి సమర్పించారు. ముక్కోటి ఏకాదశి పుణ్యదినం సందర్భంగా వీటిని స్వామి వారి పాదాలకు అమర్చారు. దాత కుటుంబ సభ్యులు బంగారు పాదాలను మామిడికుదురు నుంచి మేళతాళాలతో భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపుగా అప్పనపల్లి తీసుకువచ్చారు.

అర్జీల పరిష్కారానికే ప్రాధాన్యం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- స్పందనలో 90 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న అర్జీల పరిష్కారాన్ని ప్రాధాన్యంగా గుర్తించాలని జిల్లా అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక – స్పందన జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 90 మంది నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ శుక్లా అధికారులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను సంబంధిత జిల్లా అధికారులకు అదే రోజు సమర్పించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారుల వద్ద పెండింగ్ అర్జీలు లేవని, డివిజన్, మండల స్థాయిల్లో పెండింగ్ ఉంటున్నాయని వివరించారు.

ఇదిలా ఉండగా స్పందన కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. అంత్యోదయ అన్నయోజన కింద 35 కేజీల బియ్యం ఇప్పించాలని పి.గన్నవరం గుత్తులవారి పాలేనికి చెందిన దివ్యాంగుడు వి.సాయిబాబా జేసీని ఆశ్రయించాడు. తనకు బోడసకుర్రు లే అవుట్‌లో ఇల్లు మంజూరైందని, కానీ బిల్లులు మాత్రం జమ కాలేదని అమలాపురం కొంకాపల్లికి చెందిన దివ్యాంగురాలు బి.గంగాభవాని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలస కూలీ మృతి

మలికిపురం: ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వలస కూలీ కొప్పాడి పుల్లయ్య (42) మృతి చెందాడు. వరినాట్లు వేసేందుకు జట్టు కూలీ పనికి పుల్లయ్య లక్కవరం వచ్చాడు. ఆదివారం సాయంత్రం పని ముగించుకుని పంట కాలువలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ ఆ కాలువలో పడి గల్లంతయ్యాడు. పుల్లయ్య మృతదేహం సోమవారం లభించింది. అతడి భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉంది. వారికి ఇద్దరు కుమారులు. చిన్న పిల్లలు కావడంతో వారిని పుల్లయ్య తనతో పాటు లక్కవరం తీసుకు వచ్చాడు. తండ్రి పుల్లయ్య మరణంతో చిన్నారులు, తోటి కూలీలు విషాదంలో మునిగిపోయారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని, పుల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించామని మలికిపురం ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రావులపాలెం: జాతీయ రహదారిపై స్థానిక అరటి మార్కెట్ యార్డు వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మతి స్థిమితం లేని ఆ వ్యక్తి ఆరు నెలలుగా రోడ్లపై తిరుగుతున్నాడు. ఉదయం 10.30 గంటల సమయంలో కొవ్వూరు డిపోకు చెందిన బస్సు రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తుండగా జాతీయ రహదారి డివైడర్ పైనుంచి ఈ వ్యక్తి ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చాడు. దీంతో అతడిని బస్సు ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయం కావడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన ప్రాంతానికి రావులపాలెం పోలీసులు, హైవే సిబ్బంది చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు.

ఇల వైకుంఠమై..

- ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- రత్నగిరిపై శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవిగా సత్యదేవుడు, అమ్మవారు
- ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్న భక్తులు
- ఇతర ఆలయాల్లోనూ భక్తజన కోలాహలం


శేషపాన్పుపై పవళించిన విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పుణ్యదినాన్ని పురస్కరించుకుని కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని వైష్ణవాలయాలు సోమవారం ఇల వైకుంఠధామాల్లా ప్రకాశించాయి. అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. సుగంధభరిత పుష్పాలంకరణ నడుమ.. పాలకడలిలో శేషపాన్పుపై శయనించిన శ్రీమహావిష్ణువులా సత్యదేవుడు.. ఆయన పాదాల చెంత శ్రీమహాలక్ష్మీదేవిలా అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు సర్వాలంకార భూషితురాలై శోభిల్లుతుండగా.. వేలాది మంది భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించి తరించారు. తొలుత తెల్లవారుజామున 4 గంటలకు ప్రధానాలయంలో సుగంధ పుష్పాలంకరణతో తీర్చిదిద్దిన ప్రత్యేక మంటపంలో శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి అలంకారాల్లో ఉన్న సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పంచహారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉత్తర ద్వారం గుండా దర్శనానికి భక్తులను అనుమతించారు. విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా రూపు దాల్చిన స్వామి, అమ్మవార్లను వేలాదిగా దర్శించిన భక్తులు.. అనంతరం ప్రధానాలయంలో సత్యదేవుడు, అమ్మవార్లను కూడా దర్శించి, దక్షిణ ద్వారం నుంచి ఆలయం వెలుపలకు వచ్చారు. ఉత్తర ద్వార దర్శనం కోసం తెల్లవారుజామున 4 గంటల నుంచే క్యూలో నిలుచున్నారు. ఈ సందర్భంగా అంతరాలయ దర్శనాన్ని అధికారులు రద్దు చేశారు. సాయంత్రం నుంచి యథావిధిగా దక్షిణ ద్వారం నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా కూరగాయలతో ప్రత్యేకంగా వండిన కదంబం ప్రసాదాన్ని స్వామి, అమ్మవార్లకు నివేదించి, తరువాత భక్తులకు పంపిణీ చేశారు. సత్యదేవుడు, అమ్మవార్లను కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులతో దర్శించారు. ప్రముఖ దాత, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే సత్యప్రసాద్ కూడా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించారు. సత్యదేవుడు, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో వెండి రథంపై ఘనంగా ఊరేగించారు. రథం లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. సత్యదేవుడిని 30 వేల మంది భక్తులు దర్శించారు. వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.


స్వామివారిని దర్శించేందుకు క్యూలో నిల్చున్న భక్తులు


తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు. పాల్గొన్న చైర్మన్ రోహిత్, ఈఓ సత్యనారాయణమూర్తి, ఏసీ రమేష్‌బాబు

ఆకట్టుకున్న పుష్పాలంకరణ

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, సత్యదేవుని ప్రధానాలయంలో చేసిన పుష్పాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. అలాగే స్వామివారి ఆలయానికి దారి తీసే ఉత్తర ద్వారం మెట్లను రంగురంగుల విద్యుద్దీపాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనివేటి మంటపం ముందు సత్యదేవుడు, అమ్మవారి నమూనా విగ్రహాల వద్ద పుష్పాలంకరణ, గోకులం వద్ద పుష్పాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ భక్తులను అలరించాయి. అనేకమంది భక్తులు ఆ ఫ్లెక్సీ ముందు ఫొటోలు దిగారు.

సర్వపాపహరం.. ఉత్తర ద్వార దర్శనం

నిత్యం సత్యదేవుని నామోచ్చారణ ప్రతిధ్వనించే రత్నగిరి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం నాడు విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లను దర్శించడం ఎంతో పుణ్యప్రదమని, సర్వపాపహరమని విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు. ఆయన తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారం గుండా స్వామి, అమ్మవార్లను దర్శించి, పూజలు చేశారు. గర్భాలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి మూలవిరాట్‌లకు కూడా పూజలు చేశారు. స్వాత్మానందేంద్రకు ఆలయం వద్ద దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు, ప్రసాదాలు అందజేశారు.


స్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి

అప్పనపల్లిలో భక్తజన కోలాహలం

మామిడికుదురు: అప్పనపల్లిలో శ్రీ బాలబాలాజీ స్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు వేకువనే తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. తెల్లవారుజామున ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజల అనంతరం వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఉత్తర ద్వారం వద్ద ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారు నయనానందకరంగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తులు తన్మయత్వం పొందారు. గోదాదేవికి నిర్వహించిన లక్ష చామంతి పూజలో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా వైకుంఠ ద్వారం వద్ద స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదాశీర్వచనం చేశారు. ఏర్పాట్లను ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, దేవస్థానం ఈఓ ఎంకేటీ నాగవరప్రసాదరావు పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ట్రస్టీలు స్వామివారిని దర్శించుకున్నారు.


బాలబాలాజీ స్వామిని ఉత్తర ద్వారం వద్ద దర్శించుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

స్నేహితుడిపై అనుమానం?

మండపేట: పట్టణంలో సంచలనం కలిగించిన యువకుని అనుమానాస్పద మృతి కేసులో అతడి స్నేహితుడి పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక నాళం వారి వీధిలోని స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్న కొనిజాల సురేష్ (28).. శనివారం రాత్రి స్నేహితుడు వీరబాబుతో కలిసి నూతన సంవత్సర వేడుకల కోసం వెళ్లి అనుమానాస్పద రీతిలో మృతి చెందిన విషయం విదితమే. ఇద్దరూ కలిసి మద్యం తాగిన తర్వాత సురేష్‌ను మోటారు సైకిల్‌పై మెయిన్ రోడ్డులోని థియేటర్ సమీపాన దించి వెళ్లిపోయానని వీరబాబు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. కాగా మృతుడు సురేష్ బంధువులు, స్నేహితులు వీరబాబు పాత్రపై అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. మృతుడి తలపై గాయాలుండటంతో ఎవరైనా అతడిని కొట్టి హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. సురేష్ మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. వీరబాబుపై అనుమానాలున్నాయని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పి.శివగణేష్ తెలిపారు.

అంతర్వేదికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఏకాదశి శుభ ఘడియల్లో అంతర్వేది నారసింహుడు వైకుంఠ ధామునిగా దర్శనమిచ్చిన ఘడియలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వేకువజామున ఉత్తర ద్వారం వద్ద అర్చకులు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ, మంగళ వాయిద్యాలతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. వివిధ రకాల పుష్పాలు, తులసి మాలలతో ఉత్సవ మూర్తులను అలంకరించారు. మంగళ హారతులు ఇచ్చారు. స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు అంచనాలకు మించి తరలి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఆలయ ప్రాకారం వెలుపల భారీ క్యూలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి మరీ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల నారసింహ నామస్మరణ ఆలయంలో ప్రతిధ్వనించింది. భక్తుల రద్దీకి తగ్గట్టుగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు కుటుంబ సమేతంగా ఉత్తర ద్వారం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, పూజలు చేశారు. నారసింహ సుదర్శన హోమం వద్ద ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు వేదాశీర్వచనాలు పలికారు. రాజోలు మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఉత్తర ద్వార దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే రాపాక దంపతులు


అంతర్వేదిలో ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిచ్చిన స్వామి


అంతర్వేది ఆలయ ప్రాకారం వెలుపల భారీ క్యూ

వాడపల్లిలో కన్నుల పండువగా..


కన్నుల పండువగా స్వామి వారి గ్రామోత్సవం


శేషపాన్పుపై ఉభయ దేవేరులతో ఉత్తర ద్వార దర్శనమిచ్చిన శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. శేషపాన్పుపై కొలువుదీరిన స్వామివారిని వేకువజాము నుంచే వేలాదిగా మంది భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించుకున్నారు. అలాగే ప్రధాన ఆలయంలోని మూలవిరాట్టును కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి, ఆత్రేయపురం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు.

ప్రముఖులకు స్వామి వివేకానంద పురస్కారాలు


డాక్టర్ కేవీ వరప్రసాదరెడ్డి


సీవీ నాగార్జునరెడ్డి


డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు


డాక్టర్ శోభారాజు

అనపర్తి: వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులను ప్రతిష్ఠాత్మక స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ వివరాలను ఆయన సోమవారం విలేకర్లకు వెల్లడించారు. అనపర్తి శ్రీరాకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన ఏటా ఈ పురస్కారాలు అందిస్తున్నారు. స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారం–2023కు పద్మభూషణ్ పురస్కార గ్రహీత, శాంతా బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కేవీ వరప్రసాదరెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, ప్రముఖ క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు, హైదరాబాద్ సౌమ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పద్మశ్రీ పురస్కార గ్రహీత, అన్నమయ్య సంకీర్తనల స్వరకర్త, ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజులను ఎంపిక చేశామని వివరించారు. స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 25న సమితి ఆధ్వర్యంలో జరిగే స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి వినిశ్చలానందజీ మహరాజ్ చేతుల మీదగా ఈ పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరిస్తామని దుర్గాప్రసాద్ తెలిపారు.

తండ్రికి కుమార్తె తలకొరివి

కాట్రేనికోన: కని, పెంచి, పెద్ద చేసిన తండ్రికి కూతురే అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మండలంలోని పల్లంకుర్రు శివారు చింతల చెరువు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాపే అప్పారావు, మేరీరత్నం దంపతులకు మగపిల్లలు లేరు. ఐదుగురు కుమార్తెలు. వారినే ఆ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఉన్నత చదువులు చదివించి, అందరికీ వివాహాలు చేశారు. మూడో కుమార్తె వెంకటలక్ష్మి దొంతికుర్రు గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పని చేస్తోంది. ఇదిలా ఉండగా అప్పారావు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. హిందూ సంప్రదాయం ప్రకారం శ్మశాన వాటికకు ఆడవారు వెళ్లరు. కానీ అప్పారావు దంపతులకు కుమారుడు లేకపోవడంతో కుమార్తెలే అతడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పెద్ద కుమార్తె స్వర్ణలత తలకొరివి పెట్టింది. చింతల చెరువు నుంచి కోతుల చెరువు వరకూ సుమారు 4 కిలోమీటర్ల మేర అంతిమ యాత్ర జరగగా.. మిగిలిన నలుగురు కుమార్తెలూ కొద్దిసేపు తండ్రి పాడె మోశారు. అది చూసి గ్రామస్తులు చలించిపోయారు. వారికి తోడుగా అధిక సంఖ్యలో స్థానికులు శ్మశానం వరకూ వెళ్లారు.


తండ్రి అంతిమయాత్ర నిర్వహిస్తున్న అప్పారావు కుమార్తెలు

చెరువులో విషప్రయోగం


చనిపోయి, చెరువులో ఒక పక్కకు కొట్టుకువచ్చిన చేపలు


బాధితుడిని వివరాలు అడుగుతున్న ఏఎస్సై ప్రసన్నకుమార్

- చనిపోయిన చేపలు
- రూ.3 లక్షల నష్టం

కరప: గ్రామంలోని ఒక చెరువులో గుర్తు తెలియని వ్యక్తి గ్యాస్ బిళ్లలు కలపడంతో సుమారు రూ.3 లక్షల విలువైన చేపలు చనిపోయాయి. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. కరప పల్లపువీధి రామాలయానికి చెందిన గుర్రప్ప చెరువును గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలా నాగభూషణం రూ.75 వేలకు లీజుకు తీసుకుని చేపలు పెంచుతున్నాడు. చిన్న సైజు చేపలను విత్తనాలుగా, పెద్ద చేపలను మార్కెట్‌లో అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం చెరువు వద్దకు వచ్చి చూసేసరికి చేపలు చనిపోయి, తేలుతూ కనిపించాయి. శనివారం రాత్రి ఎవరో గ్యాస్ బిళ్లలు కలిపి ఉంటారని, అందుకే రెండు రోజులకు చెరువు విషతుల్యమై, చేపలు చనిపోతున్నాయని తెలిపాడు. ఇప్పటికే రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టానని, రెండు మూడు రోజుల్లో పట్టుబడి చేసి, చేపలు అమ్ముదామనుకుంటే ఇంతలోనే ఇలా జరిగిందని నాగభూషణం విలపించాడు. చాలా కాలం నుంచి చెరువులు లీజుకు తీసుకుని చేపల వ్యాపారం చేస్తున్నానని, ఎప్పుడూ ఇంత దారుణం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కరప ఏఎస్సై జి.ప్రసన్నకుమార్ చెరువు వద్దకు వచ్చి పరిశీలించారు. నాగభూషణాన్ని వివరాలడిగి తెలుసుకున్నారు. చేపలు చనిపోవడంతో మూడు నాలుగు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లి ఉంటుందని, ఈ దారుణానికి ఒడిగట్టిన దుండగుడిని పట్టుకుని, బాధితుడు నాగభూషణానికి న్యాయం చేయాలని స్థానిక వార్డు సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాస్ కోరారు.

చెరువులోని నీటిని, చనిపోయిన కొన్ని చేపలను పరీక్షల కోసం కాకినాడలోని మత్స్యశాఖ ల్యాబ్‌కు పంపించామని కరప ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. నీరు విషతుల్యమై చేపలు చనిపోయాయా, ఇంకేమైనా కారణాలున్నాయా అనేది ఈ పరీక్షల్లో నిర్ధారణ అవుతుందని, ఆ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని వివరించారు.